ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

3★ జిల్లా వార్తలు

బుధవారం 18 సెప్టెంబరు 2024



ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యం

జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న నేరెళ్ల శారద, అధికారులు

- రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య దిశగా ప్రజాపాలన
- ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ గ్యారంటీ పథకాల అమలు
- తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

పెద్దపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా పని చేస్తున్నామన్నారు. రూ.2 లక్షల వరకు ఏక కాలంలో రుణ మాఫీ చేశామని, మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం, 200 యూ నిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే సబ్సిడీ వంట గ్యాస్ అందిస్తున్నదని అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ప్రాంగ ణంలో పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్యం దిశగా హైదరాబాద్ సంస్థానం విలీనమైన రోజున తెలంగాణ ప్రజా పాలన దినోత్స వంగా నిర్వహించుకుంటున్నామన్నారు. 1948 సెప్టెంబర్ 17వ తేదీన చరిత్రలో చాలా ప్రాముఖ్యత ఉందని, 75 ఏళ్ల క్రితం ఇదే రోజున హైదరాబాద్ సంస్థానం రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య భారతదేశంలో అంతర్భాగంగా మారిందన్నారు. తెలంగాణ ప్రజాస్వామిక స్వేచ్ఛను పొందడం కోసం ఆనాటి సమాజం ఉద్యమించిందని, ఆదివాసీ యోధుడు కొమురం భీమ్, దొడ్డి కొమురయ్య, రావి నారాయణరెడ్డి, స్వామి రామానందతీర్థ, భీంరెడ్డి నర్సింహారెడ్డి, వీర వనిత చాకలి ఐలమ్మ, ప్రజాఉద్యమానికి సేనాధిపతిగా నిలిచిన ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, బొమ్మగాని ధర్మభిక్షంగౌడ్, దేవులపల్లి వేంకటేశ్వర్‌రావు, బద్దం ఎల్లారెడ్డి వంటి ప్రజానేతల త్యాగాలను సగర్వంగా స్మరించుకుందామన్నారు. తమ అక్షరాలతో ప్రజల్లో ఉత్తేజాన్ని నెలకొల్పిన సురవరం ప్రతాపరెడ్డి, ప్రజాకవి కాళోజి, మగ్దూం మొహియుద్దీన్, దాశరథి కృష్ణమాచార్య, సుద్దాల హనుమంతు, బండి యాదగిరి, షోయబుల్లాఖాన్ వంటి సాహితీమూర్తులకు ఘనమైన నివాళులర్పిద్దామన్నారు.



మాట్లాడుతున్న నేరెళ్ల శారద

రైతులకు ఏకకాలంలో రుణమాఫీ

ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీ పథకాలను అమలుచేసే దిశగా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని నేరెళ్ల శారద అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 2 రోజుల వ్యవధిలోనే మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించామని, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా పథకాన్ని ప్రారంభించామని, రాష్ట్రంలోని పేదలకు గృహావసరాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం గృహజ్యోతి పథకాన్ని ప్రారంభిం చిందని అన్నారు. రైతు సంక్షేమమే ప్రథమ లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, ఏక కాలంలో రుణమాఫీ అంశాన్ని సుసాధ్యం చేసిందని, 2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేశామన్నారు. మహిళలను ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటు అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరా మహిళాశక్తి కార్యక్రమాన్ని రూపొందించి, వచే ఐదేళ్లలో దాదాపు లక్ష కోట్ల రుణాలు మహిళలకు అందేలా చర్యలు తీసుకుంటున్నా



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

మన్నారు. ప్రజలందరికి సకాలంలో నాణ్యమైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం యూనివర్సల్ హెల్త్ కేర్ పాలసీ రూపొందిస్తోందని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేసిందన్నారు. జిల్లాలోని స్థానిక యువతకు ఉపాధి లభించే విధంగా వివిధ కోర్సులలో అవరమైన శిక్షణ అందించేందుకు ఎంపీడీవో ప్రాంగణంలో ఆధునిక టాస్క్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, యువత డ్రగ్స్ గంజాయి వంటి వాటికి అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, దీనిని నివారించేందుకు ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. అనంతరం ఆమె మహిళా శిశు సంక్షేమ శాఖ, వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కఠారి రేవతిరావు, అదనపు కలెక్టర్లు జె అరుణశ్రీ, జీవీ శ్యాంప్రసాద్‌లాల్, డీసీపీ ఎం చేతన, ఆర్డీవో బీ గంగయ్య, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన అధికారులు, ఇతరులు

జడ్పీలో జెండా ఎగురవేసిన కలెక్టర్

పెద్దపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నరేందర్, డిప్యూటీ సీఈవో సంధ్యారాణి, సూపరింటెండెంట్ ముద్దసాని రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

గర్భిణులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 17: మాతా శిశు ఆసుపత్రిలో గర్భిణులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. మంగళవారం మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఔట్ పేషెంట్ విభాగం, మందుల విభాగం, చిన్నపిల్లల వైద్య విభాగాలను పరిశీలించిన కలెక్టర్ ఆసుపత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో గర్భిణులు కూర్చునే విధంగా సీటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. 3 సీటర్ బెంచ్‌లను వెంటనే అవసరమైన మేరకు కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఆస్పత్రిలో నిర్వహించే ల్యాబ్ పరీక్షల ఫలితాలు వేగవంతంగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆశా కార్యకర్తలతో మాట్లాడుతూ వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో గర్భిణులకు మెరుగైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. వెంట ఆర్ఎంవో డాక్టర్ రవీందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఖని ఆసుపత్రిలో విధుల్లో చేరిన 23మంది వైద్యులు : కలెక్టర్

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 17: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, సిమ్స్‌లో 23మంది వైద్యులు మంగళవారం విధుల్లో చేరారని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 16 నుంచి 30వరకు మెడికల్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్వ్యూకు 36మంది హాజరు కాగా అందులో 23మందిని ఎంపిక చేసినట్టు అసోసియేట్ ప్రొఫెసర్-1, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 11మంది, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు-4, ట్యూటర్ కమ్ డ్యూటీ మెడికల్ అధికారులు ఏడుగురు విధుల్లో చేరినట్టు ఆయన పేర్కొన్నారు.

పాఠాలు బోధిస్తున్న సమయాల్లో సెల్‌ఫోన్లు వాడొద్దు

- జిల్లా ఇన్‌చార్జి విద్యాధికారి జనార్ధన్‌రావు

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 17 : ప్రభుత్వ పాఠశాలల తరగతి గదుల్లో పాఠాలు బోధిస్తున్న సమయంలో సెల్ ఫోన్‌లు వాడొద్దని జిల్లా ఇన్‌చార్జి విద్యాధికారి జనార్ధన్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల గదులు, విద్యార్థుల సంఖ్య, మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల సమయపాలనపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పరీక్ష ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. వెంట జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి పీఎం షేక్, ప్రధానోపాధ్యాయురాలు మాధురి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఢిల్లీ పెద్దల మెప్పు కోసమే రాజీవ్‌గాంధీ విగ్రహం

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, సెప్టెంబరు 17: రాష్ట్ర సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు కోసం క్యాబినెట్ తీర్మానం చేసిన స్థలంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంగళవారం స్థానిక చౌరస్తా సమీపంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దల మెప్పు కోసం రేవంత్‌రెడ్డి రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. తెలంగాణ ఉద్యమం, ప్రజలతో సంబంధం లేని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సచివాలయం ఎదుట ఏర్పాటు చేయడం ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనని చెప్పారు. తొమ్మిది మాసాల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనలో విఫలమైందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు పెంట రాజేష్, పాముకుంట్ల భాస్కర్, అంజలి, గాందం విజయ, కృష్ణవేణి, ఎస్‌వీ రమణారెడ్డి, ఫైడిపెల్లి మురళీధర్‌రావు, పీటీ స్వామి, అచ్చెవేణు, బొడ్డు రవీందర్, చల్లగురుగుల మొగిలి, పిల్లి రమేష్, చెలుకలపెల్లి శ్రీవాస్ పాల్గొన్నారు.

ఘనంగా పెరియార్ జయంతి

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 17: పెరియార్ రామస్వామి జయంతిని మంగళవారం కాలనీలో వివిధ సంఘాలు ఘనంగా నిర్వహించాయి. భారత నాస్తిక సమాజం ఆధ్వర్యంలో పోతనకాలనీలో జరిగిన కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు జీడీ సారయ్య పెరియార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అడ్డాపురం చంద్రమౌళి, రాంశాన్, అజయ్, శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం



పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఆర్డీవో



గోదావరిఖనిలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



నాగులపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో..

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 17 : పెద్దపల్లి మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో గంగయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో కవితతోపాటు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో ఇంచార్జి ఎంపీడీవో శ్రీధర్, ఎంపీవో ఫయాజ్, డిప్యూటీ తహసీల్దార్ విజేందర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓదెల : మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాపాలన వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్ యాకయ్య, ఎంపీడీవో తిరుపతి, ఎస్సై అశోక్ రెడ్డి జాతీయ పతాకాలను ఆవిష్కరించి గౌరవ వందనాన్ని సమర్పించారు. గ్రామపంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు ప్రజాపాలన వేడుకలను నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీవో షబ్బీర్, ఏవో భాస్కర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ :ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మిరాజమల్లు కార్యాలయ ఆవరణలో మేనేజర్ అలీమొద్దీన్ జాతీయ జెండాలను మంగళవారం ఎగరవేశారు. మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ బిరుదు సమత కృష్ణ, కౌన్సిలర్లు పసెడ్ల మమత, సంపత్, నిషాద్ ,రఫీక్, చింతల సునీత రాజు, రెవెల్లి తిరుపతి, దున్నపోతుల రాజయ్య, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మారం : మండలంలో మంగళవారం ప్రజాపాలన దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ ఆరిఫ్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎస్సై లక్ష్మణ్, ట్రాన్స్‌కో ఏఈ ఖాశీం, ఎంఈవో ఛాయాదేవి జాతీయ పతాకాలను ఎగరవేశారు. అలాగే నందిమేడారం సింగిల్‌విండో కార్యాలయంలో చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులు జాతీయ జెండాలను ఎగురవేశారు.

ముత్తారం : మండల కేంద్రంతోపాటు మండలంలోని 14 గ్రామపంచాయతీల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్ తహసీల్దార్ సుమన్, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జూలపల్లి : మండలకేంద్రంతో పాటు గ్రామాల్లోని ప్రభుత్వ, గ్రామపంచాయతీ కార్యాలయాలుతోపాటు పలు కూడళ్లలో మంగళవారం ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు, వివిధ పార్టీలకు చెందిన ప్రముఖ నాయకులు జాతీయజెండాలను ఆవిష్కరించి వందన చేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి అనిల్‌రెడ్డి, కార్యదర్శులు పలువురు పాల్గొన్నారు.

ఎలిగేడు : తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ బషీరొద్దీన్, డీటీ కిరణ్ కుమార్, ఎంపీడీవో భాస్కర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్ రెడ్డి, పుల్లూరి వేణుగోపాల్‌రావు, ఏవో ఉమాపతి, ఏపీఎం సుధాకర్, పశు వైద్యులు రఘూన్నీ, విద్యుత్ ఏఈ సంపత్‌రెడ్డి, గ్రామ స్పెషల్ ఆఫీసర్లు జగదీష్‌బాబు, కార్యదర్శులు లలిత, అంజలి, పాపయ్య, పున్నమయ్య, వీవో ఏ హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామగిరి : మండలంలో ప్రజాపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల స్పెషల్ అధికారి వీరబుచ్చయ్య జెండాలను ఆవిష్కరించారు. గ్రామాల్లో పంచాయతీ సెక్రెటరీల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఎంపీడీవో శైలజారాణి, సూపరింటెండెంట్ ఉమేష్, జూనియర్ అసిస్టెంట్‌లు షరీఫ్, కవిత, టీఏ సుప్రియలు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : తెలంగాణ విమోచన దినోత్సవాన్ని మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ చౌరస్తాలో పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేస్ జాతీయపతాకాన్ని ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. సాగంటి శంకర్, దేవనపల్లి చక్రపాణి, కిషన్‌నాయక్, తిరుపతిరెడ్డి, అనుము రాములు, సారయ్యనాయక్, మేరుగు రాజేశం, రాకేష్, రాజు, అఫ్సర్ పాల్గొన్నారు.

మంథని : ప్రజాపాలన దినోత్సవాన్ని మంథనిలో అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఆర్డీవో హనుమానాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, తహసీల్దార్ రాజయ్య, ఎంపీడీవో పూర్ణచందర్‌లతోపాటు బీజేపీ నేతలు, ఆయా కార్యాలయాలు, విద్యా సంస్థల వద్ద అధికారులు జాతీయ జెండాలను అవిష్కరించారు. జెండాకు వందనం చేశారు. కార్యక్రమాల్లో అధికారులు, రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.



మంథనిలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఆర్డీవో, ఉద్యోగులు

కాల్వశ్రీరాంపూర్ : మండలంలో ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో త్రివర్ణ ప్రతాకాన్ని ఎగరవేసి గౌరవ వందనం చేశారు. తహసీల్దార్ శంకర్, ఎంపీడీవో రామ్మోహన్‌చారి, సింగిల్‌విండో చైర్మన్ చదువు రామచంద్రరెడ్డి, ఏవో నాగార్జున, ఎంపీవో గోవర్ధన్, త్రివర్ణ ప్రతాకాన్ని ఎగరవేసి గౌరవ వందనం చేశారు. విండో వైస్‌చైర్మన్ కామెడీ సంధ్యా వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాదాసి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ : గోదావరిఖని పట్టణంలో మంగళవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. రీగల్ షూమార్టు వద్ద కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ జెండావిష్కరణ చేశారు. సోమారపు అరుణ్‌కుమార్, సుల్వ లక్ష్మీనర్సయ్య, పద్మ, శివరాం, సునీల్, శివ, కుమారస్వామి పాల్గొన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో విమోచన దినోత్సవం సందర్భంగా భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేని శంకర్ హాజరై జెండావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో కనకరాజు, తాండ్ర సదానందం, వైవీ రావు, కేవీ స్వామి పాల్గొన్నారు.

కోల్‌సిటీ : తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా నగర పాలక సంస్థకార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మేయర్ బంగి అనీల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బాల రాజ్‌కుమార్, ముస్తాఫా, పాతిపెల్లి ఎల్లయ్య, అడ్డాల రామస్వామి, ఈఈ రామన్, ఎగ్జామినర్ వేణుమాధవరెడ్డి పాల్గొన్నారు.

అలాగే రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం అధికారులకు, సిబ్బందికి సీపీ ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ సురేంద్ర, ఆర్ఐ దామోదర్, ఆర్ఎస్ఐ శ్రావణి, వెంకట్, సీపీఓ, వివిధ వింగ్స్, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకుర్తి : మండలం పరిధిలోని అన్ని గ్రామాల్లో మంగళవారం ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ ఎం జ్యోతి, ఎంపీవో సుదర్శన్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

ఘనంగా ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 17: ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను మంగళవారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య, అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సుల్వ లక్ష్మీనర్సయ్య, పద్మ, సునీల్, శివ, కిషన్, రమేష్, రాజేందర్ పాల్గొన్నారు. కళ్యాణ్‌నగర్‌లో బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు క్యాతం వెంకటరమణ, హన్మంతుగౌడ్ మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోడూరి రమేష్, గోపాల్, శ్రీనివాస్, రవి, ఉష, శంకర్, భాస్కర్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్ : మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా జరిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు నాయకులు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మచ్చగిరి రాము, మట్ట శంకర్, ఇరుగురాల పోషం, వడ్లకొండ తిరుపతి, కొయ్యడ సతీష్, బర్ల సదానందం, పంతకాని విశ్వతేజ, పడాల కనకయ్య, లక్ష్మణస్వామి, గట్టు శ్రీనివాస్, జంగపల్లి శ్రీనివాస్, సారయ్య, మోరే ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

యువ కార్మికులే సింగరేణి భవిష్యత్ : సీఎండీ


గోదావరిఖని, సెప్టెంబరు 17: సింగరేణి సంస్థలో 50శాతానికి పైగా యువకులే ఉద్యోగులు, కార్మికులుగా ఉన్నారని, ఈ యువశక్తి కంపెనీ ఉజ్వల భవిష్యత్‌కు దోహద పడుతుందని సీఎండీ బలరాం అన్నారు. రానున్న ఐదేళ్లలో సింగరేణి వార్షిక టర్నోవర్ రూ.60వేల కోట్లకు చేరుతుందని బలరాం చెప్పారు. సింగరేణి భవన్‌లో మంగళవారం జరిగిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సింగరేణి వ్యాపార విస్తరణ దిశగా వేగంగా ముందుకు సాగుతుందని బలరాం చెప్పారు. రానున్న రోజుల్లో రాజ్‌స్థాన్ సోలార్ పవర్‌ప్లాంట్‌తో పాటు సింగరేణిలో మూసివేసిన ఉపరితల గనుల్లో సంప్‌డ్ స్టోరేజీ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో జీఎం(కో ఆర్డినేషన్) సుభాని, జీఎం(మార్కెటింగ్) రవి ప్రసాద్, అన్ని విభాగాల అధికారులు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.









గల్ఫ్ కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటాం

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


ఆది శ్రీనివాస్‌ను కలిసిన గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు

వేములవాడ, సెప్టెంబర్ 17 : జీవనోపాధి కోసం రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాలకు వలస వెళ్లి వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరు లతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజు నుంచి గల్ఫ్ కార్మికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారం కోసం వివిధ దశలలో చర్చలు జరిపామన్నారు. గల్ఫ్ బోర్డు ఏర్పాటు, ఎన్నారై పాలసీ అమలుపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఈ నెల 14వ తేదీన హైదరాబాదులో పలువురు శాసనసభ్యులు, గల్ఫ్ కార్మిక సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నివేదించగా, ముఖ్య మంత్రి వెంటనే స్పందించి గల్ఫ్ సంక్షేమం కోసం నాలుగు అంశాలను అమలు చేస్తూ వెను వెంటనే జీవో విడుదల చేశారన్నారు. 2023 డిసెంబర్ 7వ తేదీ నుంచి ఏ కారణం చేతనైనా గల్ఫ్ దేశాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు 5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలి పారు. గల్ఫ్ కార్మికుల సమస్యలను విని పరిష్కరించేందుకు హైదరాబాద్ ప్రజాభవన్‌లో ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామని, గురుకుల పాఠశాలు, కళాశాలలో గల్ఫ్ కార్మికుల పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. గల్ఫ్‌లో మృతి చెందిన వేములవాడ నియోజకవర్గ పరిధిలోని ఇద్దరు కార్మికులకు 5 లక్షల రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించామన్నారు. టీఆర్ఎస్ నాయకులు గల్ఫ్ కార్మికులను మోసం చేశారన్నారు. గల్ఫ్ కార్మిక సంఘం నాయకులు మంగళవారం వేములవాడ పట్టణంలోని క్యాంపు కార్యాల యంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలసి ధన్యవాదాలు తెలిపారు.















న్యూస్ బాక్స్

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా వరద

జగిత్యాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం వరద నీరు స్వల్పంగా వస్తోంది. ఎస్సారెస్పీలోకి 10,465 క్యూ సెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 10,465 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

27లోగా బీఎడ్ పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 17: ఎస్‌యూ పరిధిలోని బీఎడ్ రెండో సెమిస్టర్ విద్యార్థులు, ఎంఎడ్ రెండో, నాలుగో సెమిస్టర్ విద్యార్థులు ఈనెల 27లోగా పరీక్ష రుసుం చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీ రంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 500 రూపాయల అపరాధ రుసుంతో అక్టోబర్ ఒకటో తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను అక్టోబరులో నిర్వహించ నున్నట్లు ఆయన తెలిపారు.

చెట్లు నరికిన వ్యక్తికి జరిమానా

● ఫీల్డ్ అసిస్టెంట్‌కు మెమో

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 17 : మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనంలో చెట్ల నరికివేతపై ఎంపీడీవో సత్తయ్య మంగళవారం విచారణ చేపట్టారు. చెట్లను నరికివేసిన వ్యక్తిని గుర్తించి వేయి రూపాయల జరిమానా విధించారు. విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఫీల్డ్ అసిస్టెంట్ నరేశ్‌కు మెమో జారీ చేశారు. నాటిన మొక్కలను కాపాడుకునేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. చెట్లను నరికి వేస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో సత్తయ్య హెచ్చరించారు. ఎంపీవో రాజు, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

కలప చెట్లు నరికివేత

● పట్టుకున్న అటవీ శాఖ అధికారులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు17 : మండలంలోని వేములకుర్తి గ్రామ శివారులో అక్రమంగా టేకు చెట్లు నరుకుతున్న వేములకుర్తి గ్రామానికి చెందిన వ్యక్తిని మంగళవారం ఇబ్రహీంపట్నం ఎఫ్‌ఎస్‌వో చైతన్యశ్రీ పట్టుకున్నారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గ్రామ శివారులోని రామాలయం సమీపంలో నాలుగు టేకుచెట్లను కొట్టివేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అతడి వద్ద నుంచి కలప దుంగలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆమె పెర్కొన్నారు.అక్రమంగా కలప తరలించిన, నరికేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫలించిన ఆశలు

- గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం
- సమస్యలపై అధ్యయనానికి సలహా కమిటీ
- ప్రజాభవన్‌లో ప్రవాసీ ప్రజావాణి



సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 17 : గల్ఫ్ కార్మికుల ఆశలు ఫలించాయి. చాలా కాలంగా ఎదిరిచూస్తున్న ప్రవాస కార్మికుల సమస్యలకు దారిదొరికింది. గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల మానిఫెస్టోలో ప్రకటించి నిరూపించింది. గల్ఫ్ కార్మికుల మృతుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం అందించాలని, గల్ఫ్ కార్మికుల సమస్యలపై అధ్యయనానికి సలహా కమిటీ ఏర్పాటు చేయాలని, ప్రజాభవన్‌లో ప్రవాసీ ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటునకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వీటితో పాటు గల్ఫ్ కార్మికుల విద్యార్థులకు గురుకుల విద్యాలయాల్లో సీట్ల కేటాయింపునకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన డిసెంబరు 7, 2023నుంచి గల్ఫ్‌లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ. 5లక్షల పరిహారం అందించనుంది. ఈ విధంగా గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం చొరవచూపడంతో గల్ఫ్‌దేశాల్లో ప్రవాస కార్మికులు సంబరాలు జరుపుకుంటున్నారు. గల్ఫ్ కార్మికుల సమస్యలపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెటారు. రాష్ట్రంలోని ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి గల్ఫ్ దేశాలకు వేలాది మంది కార్మికులు వెళ్లి జీవనోపాధి పొందుతున్నారు. ప్రధానంగా దుబాయ్, సౌదీ, కువైట్, బహ్రెయిన్, మస్కట్, ఖతర్, ఇరాక్ దేశాలకు వెళ్లిన ప్రవాస కార్మికులు అనేక కష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం ఓ పాలసీని అమలులోకి తీసుకురావడంతో గత కొన్నేళ్లుగా గల్ఫ్ కార్మికులు పడుతున్న కష్టాలకు కొంత వెసులుబాటు లభించనుంది. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలు గల్ఫ్ కార్మికుల సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలోనే గల్ఫ్ కార్మికుల ప్రతినిధులతో సీఎం పలు మార్లు సమావేశమై చివరకు కార్యరూపం దాల్చారు. దీంతో గల్ఫ్‌లోని దుబాయ్, సౌదీ అరేబియా, కువైట్, మస్కట్, బెహరాన్, ఇరాక్ తదితర దేశాల్లో ఉన్న వేలాది మంది గల్ఫ్ కార్మికుల్లో ఆశలు చిగురించాయి.

గల్ఫ్ కార్మికులకు తీరనున్న కష్టాలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల ప్రాంతాలకు చెందిన వేలాదిమంది యువత ఉపాధికోసం గల్ఫ్‌బాట పట్టారు. ఇందులో 75శాతం కార్మికులకు కష్టాలే నెలకొన్నాయి. మిగితా 25శాతం కార్మికులు గల్ఫ్ వెళ్లి మంచి ఫలితాలే సాధిస్తున్నారు. గల్ఫ్ కార్మికుల విద్యార్థులకు గురుకుల విద్యాలయాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించడంతో ప్రయోజనం చేకూరనుంది. గల్ఫ్ వెళ్లిన కార్మికుల్లో పనులు లేక వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. వీరి సంక్షేమంకోసం ప్రభుత్వం తీసుకుంటు న్న నిర్ణయాలు ఎంతో ఉపయోగపడనుంది. గల్ఫ్‌దేశాల్లో ఉన్న కార్మికుల కష్టాలు, కన్నీళ్లు, బాధలు తీరే అవకాశం ఉంటుంది.

ఏజెంట్ల మోసాలకు అడ్డుకట్ట

గల్ఫ్ కార్మికుల సమస్యల అధ్యయనానికి సలహా కమిటీ వేయాలని నిర్ణయించడంతో ఏజెంట్ల మోసాలను అరికట్టనున్నారు. ఏజెంట్ల చేతిలో అనేకమంది కార్మికులు మోసపోయి గల్ఫ్ దేశాల్లో జైలు పాలయ్యారు. విజిట్ వీసాపై వెళ్లి చిక్కుల్లో పడ్డారు. వందలాదిమంది అప్పులపాలై పలువురు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. దీంతో ఏజెంట్ల మోసాలపై ప్రభుత్వం కఠిన చట్టాలను అమలు చేసే అవకాశం ఉంది. గల్ఫ్ దేశాల్లోని ఇండియన్ ఎంబసీల్లో హిందీ, ఇంగ్లీషు, తెలుగు మాట్లాడే అధికారులను నియమిస్తే కార్మికులకు ప్రయోజనం కలుగుతుందనే చర్చ ఉంది.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

హైడ్రాతో రాష్ట్ర వనరులను కాపాడుతాం

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కరీంనగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం కరీంనగర్ ఆర్‌అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుణమాఫీ చేయవద్దా, మహిళలకు ఉచిత ప్రయాణం వద్దా అంటూ ప్రతిపక్ష నాయకులను ప్రశ్నించారు. వీటి కోసమే రాష్ట్రం అప్పులు చేసేది అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వనరుల గురించి ప్రధాని మోదీకి తెలుసునని పేర్కొంటూ గత ప్రభుత్వం అప్పులు చేసి దుబారా చేశారని అన్నారు. ఈ ఐదేళ్లలో ఇచ్చిన ప్రతిహామీ అమలు చేస్తామన్నారు. హైడ్రా అనేది చెరువులు, వనరులు కాపాడడానికేనని, అక్రమంగా ఎవరు ఏ పనిచేసినా ఊరుకునేది లేదన్నారు. కొన్ని రాష్ట్రాలు తెలంగాణతో సహా అప్పుల్లో ఉన్నాయని ప్రధాని మోదీ చేసిన కామెంట్‌పై ఆయన స్పందిస్తూ బీజేపీ నేతగా మాట్లాడి ఉండవచ్చన్నారు. అనర్హత వేటుపై విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ దీనిపై శాసనసభాపతి నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మాజీ ఎమ్మెల్యేలు పంపిణీ చేస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ప్రజాపాలనలో ప్రజల అవసరాలను తీర్చే ప్రభుత్వం మాదన్నారు. గత ప్రభుత్వం 10 ఏళ్లలో మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను పూర్తి చేయలేదని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కారుణ్య నియామకాలు పూర్తి చేయాలి



మంత్రి శ్రీధర్‌బాబుకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న టీఎన్‌జీవో జిల్లా నాయకులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 17: జిల్లా పరిషత్‌లో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు పూర్తి చేయాలని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి కోరారు. మంగళవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకు కారుణ్య నియామకాల అభ్యర్థులతో కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాలు గత 8 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. దీనిపై స్పందించిన మంత్రి వెంటనే సీఎంవో కార్యదర్శితో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, కోశాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, టీజీవో నాయకుడు మడిపెల్లి కాళీచరణ్, సర్దార్ హర్మిందర్‌సింగ్, రాజేశ్‌భరద్వాజ్, సుమంత్‌రావు, అఫ్జల్, నాల్గవతరగతి సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, నోముల రాహులాల్‌రెడ్డి, భాగ్య, ఆదిత్యవర్ధన్, షెస్పాజ్, రఘురామ, నచికేతరెడ్డి, అజిత్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

నిజాం పాలనకు చరమగీతం పాడింది కమ్యూనిస్టులే

● సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి



అనభేరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

భగత్‌నగర్, సెప్టెంబరు 17 : హైదరాబాద్ సంస్థానంలో నిజాం పాలనకు చర మగీతం పాడింది కమ్యూనిస్టు పార్టీయే అని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. మంగళవారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా కరీంనగర్‌లోని సీపీఐ కార్యాలయం ఎదుట జెండాను ఆవిష్కరించారు. అనంతరం సాయుధ పోరాట వీరుడు, సీపీఐ మొదటి కార్యదర్శి అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రను వక్రీకరించాలని చూస్తే సీపీఐ పార్టీ చూస్తూ ఊరుకోదన్నారు. నిజాం పాలన నుండి విముక్తి కోసం బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మక్దూమ్ మొహియుద్దీన్‌లు తెలంగాణ సాయుధ పోరాటానికి సెప్టెంబర్ 11న పిలుపునిచ్చారన్నారు. ఆ పిలునందుకుని వేలాది మంది తరలి వచ్చి వీరోచిత పోరాట ఫలితంగానే హైదరాబాద్ సంస్థానాన్ని నిజాం భారత దేశంలో విలీనం చేశాడన్నారు. పాలకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జాగీరు సత్యనారాయణ, బుచ్చన్నయాదవ్, బోయిని తిరుపతి, పైడిపల్లి రాజు, కిన్నెర మల్లవ్వ, తాళ్లపల్లి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

చిగురుమామిడి, సెప్టెంబరు 17 : మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన పోలవేణి శ్రీనివాస్ (48) అనే వ్యక్తి మంగళవారం పాము కాటుతో మృతి చేందినట్లు ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. శ్రీనివాస్ ఉదయం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. కరెంటు మోటరు పెట్టేందుకు వెళుతుండగా పాము కాటు వేసింది. కుటుంబసభ్యులు శ్రీనివాస్‌ను చికిత్స నిమ్మితం కరీంనగర్‌కు తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. శ్రీనివాస్ భార్య పోలవేణి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎల్‌ఎల్‌బీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 17 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఆగస్టు 2024లో నిర్వహించిన ఎల్‌ఎల్‌బీ నాలుగో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను మంగళవారం ఎస్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరం గప్రసాద్ విడుదల చేశారు. ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.inlZ చూసుకోవచ్చని తెలిపారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి



కొండగట్టులో క్యూలైన్‌లో వస్తున్న భక్తులు

మల్యాల, సెప్టెంబరు 17 : కొండగట్టు అంజనేయస్వామి సన్నిదానం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా భక్తులు కొండపైకి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు జరిపారు. అనంతరం బేతాళడు, శ్రీరాములవారికీ పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్ పర్యవేక్షించారు.

● 30న తలనీలాల టెండర్లు

కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో పోగు చేసే తలనీలాలకు ఈనెల 30న టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఈవో రామకృష్ణరావు తెలిపారు. మూడుసార్లు టెండర్లు నిర్వహించినప్పటికీ కాంట్రాక్టర్ల కుమ్మక్కుతో వేలం పెరగ కుండా వాయిదా పడుతూ వస్తున్న టెండర్‌ను మరోసారి కూడా 30న హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

గణపతి నిమజ్జన ఊరేగింపులో గొడవ..

- ఇందిరానగర్‌లో ముగ్గురికి కత్తిపోట్లు
- ఐదుగురి అరెస్టు



నిందితుల అరెస్టు చూపిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, సెప్టంబరు 17: గోదావరిఖని ఇందిరానగర్ వద్ద సోమవారం రాత్రి గణపతి నిమజ్జన ఊరేగింపులో వివాదం చోటు చేసుకుంది. ఊరేగింపులో ఇందిరానగర్‌కు చెందిన బాగ్ విష్ణు, అజర్, గోపాల్ అర్కిట్, వీర్ల సృజన్ తదితరులు రామాంజనేయ బార్ వద్ద నృత్యాలు చేస్తుండగా గాంధీనగర్‌కు చెందిన కాకినట్ల మణికంఠ అలియాస్ మణి, గడ్డం అరుణ్ కుమార్ అలిసాయ్ సోనులు అటువైపుగా వచ్చారని, ఇందిరానగర్‌కు చెందిన విష్ణు, మరో ఇద్దరు వ్యక్తులతో గొడవ పడ్డారన్నారు. అనంతరం మణికంఠ, అరుణ్ కేసీఆర్ కాలనీకి చెందిన తాళ్లపల్లి మహేంద్ర, బోడ కౌశిక్ అలియాస్ సిద్ధు, బోడ కార్తికేయలతో కలిసి వచ్చి కత్తులతో గణపతి ఊరేగింపులో ఉన్న ఇందిరానగర్ యువకులపై హత్యాయత్నం చేసినట్లు సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఈ ఘటనలో విష్ణు, గోపాల్, సృజన్‌లకు గాయాలయ్యాయన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని, మణికంఠ, మహేంద్ర, అరుణ్ కుమార్‌లను మంగళవారం అరెస్టు చేసినట్లు ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. కార్తికేయ, కౌశిక్‌లు పరారీలో ఉన్నట్టు తెలిపారు. ఘటన జరిగిన వెంటనే నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్‌ఐ రమేష్, కానిస్టేబుళ్ల తీట్ల శ్రీనివాస్ తదితరులు సీఐని అభినందించారు.

సింగరేణి కార్మికుడి మృతిపై కుమారుడి ఫిర్యాదు

- తల్లి, సోదరిపైనే అనుమానం..
- విచారణ జరుపుతున్న పోలీసులు

కోల్‌సిటీ, సెప్టెంబరు 17 : గోదావరిఖని ఐబీ కాలనీలో సోమవారం సింగరేణి కార్మికుడు బానోత్ హరిసింగ్ మృతిపై అనుమానాలున్నాయని, తన తల్లి దస్లి, సోదరి సునీత కారణం కావచ్చని, హరిసింగ్ కుమారుడు వెంకటేష్ పోలీసులకు మంగళవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. హరిసింగ్ మృతదేహంపై గాయాలు ఉండడం, మెడ చుట్టూ బలమైన గాయం ఉండడంతో పోలీసులు పలు కోణాల్లో విచారణ జరుపుతున్నారు.

రూ. 1.68 లక్షల నగదు చోరీ

కథలాపూర్, సెప్టెంబరు 17 : మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ నుంచి డ్రా చేసి బైక్‌లో పెట్టిన రూ 1.68 లక్షలను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం ఎత్తుకెళ్లారు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం... తుర్తికి చెందిన పుర్రె గంగనర్సయ్య అనే రైతుకు రుణమాఫీ కాగా ఆ డబ్బులను డ్రా చేసుకున్నాడు. ఆ డబ్బులు బైక్‌లో పెట్టి కొంత దూరంలో ఉన్న బేకరీకి వెళ్లారు. కొంతసేపటికి వచ్చి చూసే సరికి డబ్బులు మాయమయ్యాయి. దీంతో రైతు లబోదిబోమని స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. చుట్టుపక్కన ఉన్న సీసీ పుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

మోటార్ వైర్ల చోరీ

భీమారం, సెప్టెంబరు 17: భీమారం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ పంపుసెట్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్తున్నారు. దమ్మన్నపేట, మన్నెగూడెం, కట్లకుంట, భీమారం గ్రామాల రైతులు మోటార్లు బిగించుకుని వ్యవసాయానికి నీరు వాడుతున్నారు. రాత్రి వేళ సమయాల్లో వ్యవసాయ పంపుసెట్ల మోటార్ వైర్లతో పాటు కాపర్ వైరును దొంగలు ఎత్తుకెళ్తున్నారు. రైతులు ఉదయాన్నే పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి చూడగా ఫ్యూజులు తీసివేసి వైరు కత్తిరించుకు పోవడంతో రైతులు ఒక్కసారిగా షాక్‌కు గురవుతున్నారు. వరి పంటసాగు సమయంలో ఇలా జరుగడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ కాపర్ వైరును దొంగలు ఎత్తుకెళ్లడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దొంలను పట్టుకుని కఠినంగా శిక్షించాలని రైతులు కోరుతున్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

చందుర్తి, సెప్టెంబర్ 17: చందుర్తి మండలం ఎన్గల్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. వేములవాడ రూరల్ మండలం హన్మాజీ పేటకు చెందిన గడ్డం కిషన్‌రెడ్డి ఎనగల్ గ్రామం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన నేదురి ఎల్లయ్య ద్విచక్ర వాహనంపై వేములవాడ వైపు వెళ్తూ ఎనగల్ శివారులో ఎదురెదురుగా ఢీకొన్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పిచ్చి కుక్క దాడిలో..

కోనరావుపేట, సెప్టెంబర్ 17 : కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో మంగళవారం పిచ్చి కుక్క దాడి చేయగా ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో పుల్కం జలందర్, తిక్కల రూహీ ఇంటి ముందు ఆడుకుంటుండగా పిచ్చికుక్క దాడిచేసి గాయపరిచింది. వెంటనే గమనించిన గ్రామస్థులు చిన్నారులను కాపాడారు. వైద్యం నిమిత్తం కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

కేశనపల్లిలో డీజే సీజ్

ముత్తారం సెప్టెంబర్ 17: మండలంలోని కేశనపల్లిలో సోమవారం రాత్రి అనుమతిలేకుండా డీజే సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేయడంతో పోలీసులు వాటిని సీజ్ చేశారు. సోమవారం నిమజ్జన ఊరేగింపు జరుగుతుండగా గ్రామానికి చెందిన ఓ పార్టీ మాజీ ప్రజాప్రతినిధి అనుమతి లేకుండా డీజే సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేసి మహిళలను చూస్తూ అసభ్యకరంగా వ్యవహరించాడు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో డిజే సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు


ఎన్టీపీసీలో పూజలు చేస్తున్న ఈడీ కేదార్ రంజన్ పాండు, అధికారులు


గోదావరిఖనిలో విశ్వకర్మ హోమం..


సుల్తానాబాద్‌లో వేడుకలు..

జ్యోతినగర్, సెప్టెంబరు 17 : విశ్వకర్మ జయంతిని మంగళవారం ఎన్టీపీసీలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీపీసీ ప్రాజెక్టు ఆవరణలో ప్రాజెక్టు ఈడీ కేదార్ రంజన్ పాండు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జీఎం(ఆపరేషన్స్) ఎ.కె.త్రిపాఠి, జీఎం(టిఎస్‌టిపిపి) ఎస్.కె.సాహా, ఎన్టీపీసీ ఎన్‌బీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా, ఏజీఎం(హెచ్ఆర్) సిక్దర్, అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు. కాగా, విశ్వకర్మ జయంతిని భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ ఎన్టీపీసీ కార్మిక సంఘ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎంఎస్ నాయకులు జెండాను ఎగురవేశారు. విశ్వకర్మకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎస్.సాగర్‌రాజు, కె.భాస్కర్‌రెడ్డి, సిహెచ్.సత్యనారాయణరెడ్డి, జి.కొమురయ్య, వి.రాములు తదితరులు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్ : విశ్వకర్మ జయంతి సందర్భంగా మంగళవారం గోదావరిఖనిలోని కాశీ శివలింగ సహిత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో పూజలు చేశారు. అంతకుముందు స్వతంత్ర చౌక్ నుంచి ర్యాలీగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వరకు కొనసాగింది. కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ చైర్మన్ మామిడిపల్లి భాస్కర్, గుగ్గిళ్ల రవీంద్రచారి, కజాంపురం రాజేందర్, రంగు శ్రీనివాస్, కొండపర్తి నరహరి, కట్ట నగేష్ కుమార్, చేన్నోజు నారాయణ, శ్రీనివాస్, పానుగంటి స్వామి, అయోధ్యరవి, తదితరులు పాల్గొన్నారు.

ఓదెల : మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి క్షేత్రంలో మంగళవారం విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.విశ్వకర్మ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ : మండలంలోని తుర్కలమద్దికుంటలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా జిల్లా అధ్యక్షుడు భీమోజు సురేంద్రచారి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణులు శ్రీనివాస్, శ్రీమాన్, చెల్లోజు రాజేశం, చెల్లోజు సుదర్శనం, వేణుమాధవ్, తిరుపతి, సాంబయ్య, ముకుందం, భూమయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే రాగినేడు రామాలయంలో వేడుకలు నిర్వహించారు.

సుల్తానాబాద్ : సుల్తానాబాద్ పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆవరణలో విశ్వకర్మ జయంతి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బ్రహ్మశ్రీ చిలుమోజు వీరనారాయణచార్యులు, చిలుమోజు వీరాచార్యులు, పూసాల ఆంజనేయులు, దాసోహం వెంకటేశ్వర్లు, జూపాక కుమారస్వామి, శ్రీమంతుల సదానందం, శ్రీమంతుల సంపత్, వెల్ది గోపాల్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముత్తారం : మండలం కేంద్రంలో ముత్తారం గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణ కమిటీ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి జరిగింది. కార్యక్రమంలో బసవత్తుల రమేష్ చారి, అలువోజు రవీందర్ చారి, అలువోజు మహేందర్ చారి, అలువోజు సుధాకర్ చారి, రామగిరి సంతోషం చారి, కాశివోజ్జుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు : మండలంలోని సుల్తాన్‌పూర్‌లో మంగళవారం విశ్వకర్మ భగవాన్ మహాయజ్ఞం నిర్వహించారు. మాజీ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్ రావు, మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు, అఖిలభారతీయ విశ్వకర్మ రాష్ట్రఅధ్యక్షుడు శివపల్లి రాజేశం, గర్రెపల్లి రాజేష్, శివపల్లి సత్యం, సూర్యనారాయణ, శ్రీనివాస్, సిరికొండ రమేష్ తదితరులు తెలిపారు.

పాలకుర్తి : కేశోరాం సిమెంటు కర్మాగారంలోని వర్క్‌షాప్, మైన్స్ పవర్ ప్లాంటులో జరిగిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ పాల్గొన్నారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్లాంట్‌హెడ్ శ్రీనివాసరెడ్డి, మెనేజర్ పి ప్రార్థసారథి, పర్మినెంటు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి దాడి మహేష్, వర్కింగ్ ప్రెసిడెంటు పర్శవేణి శ్రీనివాస్, క్లబ్ ప్రధానకార్యదర్శి పోతుల ప్రసాద్, మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కేశోరాంలో జరిగిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కౌశిక్ హరి, ప్రధానకార్యదర్శి మాదాసు శ్రీనివాస్, పలువురు కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

మంథని : విశ్వకర్మ జయంతి సందర్భంగా ఆలయంలో ఉత్సవాలను విశ్వబ్రాహ్మణులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అర్చనలతోపాటు హోమం నిర్వహించారు. విశ్వకర్మను దర్శించుకొని భక్తులు పూజలు చేశారు. పట్టణంలో స్వామివారి శోభయాత్రను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రహ్మణులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మండలంలోని పెగడపల్లి, గంగారం గ్రామాల్లో విశ్వకర్మ జయంతి వేడుకలను నిర్వహించారు. మాజీ ఎంపీపీలు గోపగోని సారయ్య గౌడ్, నూనేటి సంపత్ యాదవ్, మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలవేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విశ్వకర్మ పతాకాన్ని ఆవిష్కరించారు. పెగడపల్లి విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు బసవపత్రి సదానందం, గంగారం విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ధరణి మణికంఠచారి, మాజీ సర్పంచులు ఆరెల్లి సుజాత రమేష్, కొనుకటి మల్లారెడ్డి పాల్గొన్నారు.


ముత్తారంలో...


సుల్తాన్‌పూర్‌లో మహాయజ్ఞం..


కేశోరాం కర్మాగారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం

గోదావరిఖని, సెప్టెంబరు 17: రాష్ట్ర సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటును వ్యతిరేకిస్తూ స్థానిక జీఎం ఆఫీస్ చౌరస్తా సమీపంలోని తెలంగాణ తల్లికి మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్య క్షుడు కోరుకంటి చందర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ వ్యతిరేకి అని అన్నారు. రాష్ట్ర సచివాలయం ఎదుట తెలంగాణ విగ్రహం ఏర్పాటు చేయాల్సి ఉండగా రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పాముకుంట్ల భాస్కర్, అంజలి, కృష్ణవేణి, గాదం విజయ, నాయకులు నడిపెల్లి మురళీధర్‌రావు, బొడ్డు రవీందర్, అచ్చె వేణు, నారాయణదాసు మారుతి, సింహాచలం రత్నాకర్, చల్లగురుగుల మొగిలి, పిల్లి రమేష్, జావెద్‌పాషా, బొడ్డుపెల్లి శ్రీనివాస్, జక్కుల తిరుపతి, చల్లా రవీందర్‌రెడ్డి, నీరటి శ్రీనివాస్, తోకల రమేష్, సట్టు శ్రీను, పొలాడి శ్రీనివాస్, మహేందర్, కిరణ్, రాములు కొమురయ్య, వెంకటేష్, సంధ్యారెడ్డి, రమ్యయాదవ్, గుంపుల లక్ష్మి, విజయలక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్ : తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాల్సిన స్థానంలో, మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మంగళవారం పట్టణంలోని అయ్యప్ప టెంపుల్ వద్ద ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. గంట రాములు, ఉప్పు రాజ్ కుమార్, బండారి శ్రీనివాస్‌గౌడ్, మార్క లక్ష్మణ్, పూదరి చంద్రశేఖర్, రేవల్లి స్వామి, మేకల కుమార్, ఈదునూరి జైపాల్, మెట్టు సమ్మయ్య గౌడ్, సయ్యద్ ముబీన్ ఉద్దీన్, పెంచాల శ్రీధర్, ముత్యాల రాజయ్య, పల్లె మధు, కమటం శ్రీధర్, ముత్యాల లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గోదావరిఖనిలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న కోరుకంటి చందర్, ధర్మారంలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ధర్మారం : మండలంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విమోచన దినోత్సవం వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ పూస్కూరి జితేందర్‌రావుతో పాటు అన్ని గ్రామాల్లోను పార్టీ అధ్యక్షులు జాతీయ పతాకాలను ఎగరవేశారు. దొంగతుర్తి, నందిమేడారం గ్రామాల్లో తెలంగాణ తల్లి విగ్రహానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. జిల్లా సహకార సంఘాల చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాచూరి శ్రీధర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు మిట్ట తిరుపతి, దాడి సదయ్య పాల్గొన్నారు.

జూలపల్లి : మండలకేంద్రంలో బీఆర్ఎస్ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు సంకెండ్ల లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ తల్లి చిత్రపటాన్ని ఏర్పాటుచేసి క్షీరభిషేకం చేశారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. కాగా, మండలకేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ విమోచన దినోత్సవంను పురస్కరించుకుని జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు.

మంథని : స్థానిక పాత పెట్రోల్ పంపు సమీపంలో తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నేతలు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. బీఆర్ఎస్ నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, వేముల లక్ష్మయ్య, మిర్యాల ప్రసాద్‌రావు, పెగడ శ్రీనివాస్, కాయిత సమ్మయ్య, కనవేన శ్రీనివాస్, మంథని లక్ష్మణ్, ఆసీఫ్, ఇర్ఫాన్, రొడ్డ శ్రీనివాస్, వేల్పుల గట్టయ్య, గువ్వల రాజులు పాల్గొన్నారు.

ఓదెల : మండల కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలోజు రమేష్, బోడకుంట నరేష్, మ్యాడగోని శ్రీకాంత్, బోగే సదానందం, చింతం చంద్రమొగిలి, గడ్డం శ్యాం, గోశెట్టి భిక్షపతి, పలుకల నరసింహారెడ్డి, శ్రావణ్, రవి తదితరులు పాల్గొన్నారు.



ఆర్జీ-3 ఏరియాలో పర్యటించిన జీఎం(ఓపెన్‌కాస్ట్)


అధికారులతో మాట్లాడుతున్న జీఎం(ఓపెన్‌కాస్టు)

రామగిరి, సెప్టెంబరు 17: సింగరేణ సంస్థ ఆర్జీ-3 ఏరియాలో మంగళవారం జీఎం(ఓపెన్‌కాస్ట్) డీవీఎస్ సూర్యనారాయణరాజు పర్యటించారు. ఏరియాలోని ఓసీపీ-2ను సందర్శించి యంత్రాల పనితీరు, కావాల్సిన విడిభాగాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. యంత్రాల పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు తీసుకోవాల్సిన ప్రణాళికలను వివరించారు. అనంతరం జీఎం కార్యాలయంలో అధికారులతో పలు అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాధాకృష్ణ, రాజశేఖర్, కాశీ విశ్వేశ్వర్‌రావు, ఉదయ్, భాస్కర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ జోక్యం పెరిగింది : మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, సెప్టెంబరు 17: సింగరేణి సంస్థలో రోజు రోజుకు రాజకీయ జోక్యం పెరుగుతున్నదని, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేల విపరీత జోక్యం వల్ల సంస్థ ఉనికికే ప్రమాదంగా మారిందని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా పనిచేయాలని అధికారులపై కొందరు మంత్రులు, ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకురావడం సరికాదన్నారు. సంస్థ అభివృద్ధి, విస్తరణ కోసం వ్యక్తిగత పనులు చేయాలని, ఇచ్చే ఆదేశాలన్నీ పాటించాలని, లేదంటే వేటు వేస్తామని బెదిరించడం దుర్మార్గమన్నారు. జీఎం స్థాయి అధికారులను కూడా తీవ్రపదజాలంతో కొందరు ఎమ్మెల్యేలు దూషిస్తున్నారని ఆరోపించారు. పాతికేళ్లుగా సింగరేణి స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌గా గెలిచిన కార్మిక సంఘం సూచన మేరకు నియమించేవారని, ప్రస్తుతం ఎమ్మెల్యే సిఫార్సు లేఖలతో ఇవ్వడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. బదిలీ వర్కర్ల నియామక పత్రాలు కూడా ముఖ్యమంత్రి చేతులపై ఇప్పించడం హాస్యాస్పదమన్నారు.

లాభాల వాటా శాతం ప్రకటించాలి : ఏఐటీయూసీ

గోదావరిఖని, సెప్టెంబరు 17: సింగరేణి కార్మికులకు 35శాతం లాభాల వాటా ప్రకటించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి వైవీరావు, కేంద్ర కార్యదర్శి కే స్వామి తదితరులు మాట్లాడారు. లాభాల వాటా ప్రకటించని సింగరేణి యాజమాన్యానికి కార్మికుల నుంచి వరద బాధితుల సహాయం కోసం ఒక బేసిక్ మస్టర్ ఇవ్వాలా అని ప్రశ్నించారు. సింగరేణి కార్మికుల దానకర్ణులు లాంటి వారని, ఎప్పుడు ప్రకృతి విపత్తులు ఏర్పడినా, అంతర్ రాష్ట్రీయంగా, దేశీయంగా ఎన్నోసార్లు కోట్ల రూపాయలు సహాయం చేశారని వార న్నారు. కానీ కార్మికుల అనుమతి లేకుండా వాళ్ల బేసిక్‌లో ఒక రోజు వేత నం యాజమాన్యం కోత విధిస్తామనడం ఒక్క రోజులో తేలే విషయం కాదన్నారు. ఈ అంశాన్ని హెచ్ఎంఎస్ నాయకుడు రియాజ్ అహ్మద్ వివాదాస్పదం చేస్తున్నాడని, బాధ్యత రాహిత్యంగా మాట్లాడుతున్నారని వారు ఆరోపించారు. హెచ్ఎంఎస్ విప్లవ కార్మిక సంఘం కాకపోయిన ప్పటికీ విప్లవ కార్మిక సంఘాలకు కన్వీనర్‌గా చెప్పుకుంటూ విమర్శించడం మాత్రమే తన నైజంగా మార్చుకున్న రియాజ్ వైఖరి మార్చుకోవాల న్నారు. కార్మికులు రియాజ్‌ను పదేపదే తిరస్కరించినప్పటికీ ఆయన బుద్ధి మారడం లేదన్నారు. ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, వెంకటరెడ్డి, చక్రపాణి, దొం తు సాయన్న, ఎంఏ గౌస్, జూపాక రాంచందర్, ఎజ్జ రాజయ్య, ఇను ముల రాజమౌళి, తాళ్లపల్లి శ్రీనివాస్, ఏవీస్ ప్రకాష్, పడాల కనకరాజు, మాటేటి శంకర్, కవ్వల జగన్, రమేష్ కుమార్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైవీరావు

ఆర్జీ-3లో స్వచ్ఛతా స్పెషల్ క్యాంపెయిన్ ప్రారంభం


ప్రతిజ్ఞ చేస్తున్న జీఎం, అధికారులు

రామగిరి, సెప్టెంబరు 17: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ జీఎం కార్యాలయంలో స్వచ్ఛతా స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమాన్ని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు మంగళవారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వరంగ సంస్థలలో సెప్టెంబరు 16 నుంచి 30 వరకు నిర్వహించే స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 4.0ను జీఎం ప్రారంభించారు. అనంతరం జీఎం కార్యాలయం ఆవరణలో అధికారులతో ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు రఘుపతి, శ్రీనివాసులు, రాజారెడ్డి, చంద్రశేఖర్, సుదర్శనం, జనార్ధన్‌రెడ్డి, సత్యనారాయణ, రాజేంద్రప్రసాద్, ఐలయ్య, షబ్బిరుద్దీన్, నాయకులు కొటరవీందర్‌రెడ్డి, ఎంఆర్‌సీ రెడ్డి, క్లరికల్ సిబ్బంది పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : స్వచ్ఛతా స్పెషల్ క్యాంపెయిన్ 4.0లో భాగంగా మంగళవారం కార్యక్రమంపై ఆర్జీ-2 జీఎం ఆఫీస్ సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తికి అంతరం లేకుండాచూడాలి

డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి

గోదావరిఖని, సెప్టెంబరు 17: బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలగకుండా ఓబీ పనులను త్వరగా పూర్తిచేయాలని డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆర్జీ-1 ఓసీపీ-5 ప్రాజెక్టును ఆయన సందర్శించారు. ప్రాజెక్టుకు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించారు. వ్యూ పాయింట్ ద్వారా క్వారీని, బొగ్గు బెంచ్‌లన పరిశీలించారు. బొగ్గుఉత్పత్తి, రవాణాపై సమీక్షించారు. గనులకు కేటాయించిన రోజువారి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని, అందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. డైరెక్టర్ పర్యటనలో ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, ఓసీపీ-5 ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, ఎస్ఓఎం రమేష్‌బాబు, ఇన్‌చార్జి మేనేజర్ శ్రీనివాస్, సర్వే అధికారి చంద్రమౌళి, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి ఉన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : బొగ్గు ఉత్పత్తికి ఆటంకాలు ఏర్పడకుండా ఓబీ వెలికితీత పనులను చేపట్టాలని సింగరేణి డైరెక్టర్(పా, ఆపరేషన్స్) వెంకటేశ్వరరెడ్డి ఓసీపీ-3 అధికారులకు సూచించారు. మంగళవారం ప్రాజెక్టును ఆయన సందర్శించారు. క్వారీలో దిగిన డైరెక్టర్ ఓబీ కంపెనీ ఆర్వీఆర్ పనులను పరిశీలించారు. ఆయన వెంట జీఎం సూర్యనారాయణ, పీవో మధుసూదన్, సర్వే అధికారి నరసింహారావు, ఎస్ఎస్‌వో మహమ్మద్ షరీఫ్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

ధర్మారం, సెప్టెంబరు 17: ధర్మారం మండలం నల్లలింగయ్యపల్లి గ్రామానికి చెందిన గోనే మల్లేశం ఇటీవల మృతి చెందడంతో మంగళవారం బాధిత కుటుంబానికి లయన్స్ క్లబ్ తరఫున ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. బాధిత కుటుంబానికి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తలమక్కి రవీందర్‌శెట్టి ఆధ్వర్యంలో రూ.7700 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ కె.శ్రీనివాస్, మల్లేశం, ముజాహిద్, కట్ట రమేష్, మునీందర్‌రెడ్డి, రవి, చంద్రయ్య ఉన్నారు.

●ఓదెల, సెప్టెంబరు 17: మండలంలోని కనగర్తికి చెందిన పైడిపల్లి శృతి, కుమార్ కుటుంబానికి ఇదే గ్రామానికి చెందిన మచ్చ నర్సింగం వితరణ చేసిన రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మచ్చ నర్సింగం, మాజీ ఎంపిటిసి చొప్పరి సారమ్మ, రాజయ్య, ఎండి రఫీ, మేక శ్రీనివాస్, ఉడిగే సదయ్య, తోట కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌ను కలిసిన సామాజిక కార్యకర్త

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 17: తెలంగాణ రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదను మంగళవారం మండలంలోని కొత్తపల్లికి చెందిన సామాజిక కార్యకర్త కనుకుంట్ల సదానందం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారికి జ్ఞాపికను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా అనంత పద్మనాభ స్వామి వేడుకలు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సుల్తానాబాద్, సెప్టెంబరు 17: సుల్తానాబాద్ మండలం మానేటి రంగనాయక స్వామి ఆలయంలో మంగళవారం అనంత పద్మనాభ స్వామి వ్రత వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి బ్యాచ్‌ల వారీగా వ్రతం జరుపుకున్నారు. పూజారులు వ్రత మహత్యాన్ని భక్తులకు వినిపించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోటగిరి విజేందర్‌గౌడ్, నాయకులు పోన్నం చంద్రయ్య గౌడ్, అంజయ్య, రమేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం అందజేత

ముత్తారం, సెప్టెంబరు 17: మండలంలోని కాసర్లగడ్డలో భక్త ఆంజనేయ స్వామి దేవాలయానికి మల్యాల బ్యాండ్ రమేష్ అనే వ్యక్తి 10వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. కమిటీ సభ్యులు గుడి ముందు ఉన్న ఆవరణలో రేకులు వేయగా మల్యాల బ్యాండ్ రమేష్ 10వేల రూపాయలను దుర్గామాత కమిటీ సభ్యులకు అందజేశారు. ఆర్థిక సహాయం చేసిన మల్యాల బ్యాండ్ రమేష్ ను దుర్గామాత కమిటీ సభ్యులు అభినందించారు.

గణనాథుడికి విప్ అడ్లూరి ప్రత్యేక పూజలు


వినాయకుడికి పూజలు చేస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, సెప్టెంబరు 17: ధర్మారం మండల కేంద్రంలో గల రామాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయకుడికి మంగళవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. గణేష్ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని శ్రీకృష్ణ యూత్ ఏర్పాటు చేసిన లక్కీ డ్రాలో గెలిచిన విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వాహకులు ఆయనకు తీర్థ ప్రసాదం అందజేశారు. ఎస్సీ కాలనీలో గల వినాయకుడికి కూడ పూజలు చేశారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, నిర్వాహకులు ఉదయ్‌కుమార్, ప్రసాద్, కుమార్ పాల్గొన్నారు.

'తెలంగాణ సమరయోధుల విగ్రహాలు ప్రతిష్ఠించాలి'

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 17 : నిజాం నిరంకుశ పాలనను ఎదిరించి పోరాడిన వీరుల విగ్రహాలు ఊరురా ప్రతిష్ఠించాలని స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం జిల్లా అధ్యక్షులు బాలసాని వెంకటేశం అన్నారు. జిల్లా కేంద్రంలో పలువురు స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు ఎరబెల్లి రంగారావు, తానిపర్తి కాంతారావు, కాచే కమలాదేవిలను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గట్టెపల్లి సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శి కోలా వెంకటేశ్వర్‌రావు, కోశాధికారి వెలగందుల శ్రీనివాస్, డా.పూదరి దత్తగౌడ్, గుల్లకోట శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన సింగరేణి అధికారికి సన్మానం

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 17: గోదావరిఖని సింగరేణి ఆసుపత్రి అడిషనల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందిన డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్‌ను మంగళవారం మాల మహానాడు సంఘం నాయకులు సత్కరించారు. సంఘం అధ్యక్షుడు మాలెం మధు, పిట్టల వెంకటి, కొండ కుమార్, కత్తెరమల్ల రమేష్, మద్రి ఐలయ్య, దేవీ లక్ష్మీనర్సయ్య, నంది నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీధర్

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 17 : పెద్దపల్లి మండల పరిషత్ అభివృద్ధి ఇన్‌చార్జి అధికారిగా కాల్వశ్రీరాంపూర్ మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీధర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పెద్దపల్లి ఎంపీడీవోగా విధులు నిర్వహించిన గున్నాల శ్రీనివాస్‌గౌడ్ అనారోగ్య కారణాల దృష్ట్యా సెలవు తీసుకోవడంతో జిల్లా ఉన్నతాధికారులు ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీధర్‌కు బాధ్యతలు అప్పగించారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధులకు నివాళి

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 17: తెలంగాణ రైతాంగ పోరాట యోధులకు సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కాలనీలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు రాజారత్నం మాట్లాడారు. ఎల్ ప్రకాష్, బుర్ర తిరుపతి, జీ రవీందర్, అన్నారావు, శ్యాంసన్, సాంబశివరావు, శంకర్, రాజు, సంపత్ పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, సెప్టెంబర్ 17: ఇటీవల కుక్కకాటుతో తీవ్రంగా గాయపడి కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని స్వర్ణపల్లి గ్రామానికి చెందిన కోరవేన దేవాన్ష్, నానుబోతుల మానసలను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకొని మెరుగైన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్లకు సూచించారు.

వినాయక విగ్రహాల నిమజ్జనం

మంథని, సెప్టెంబర్ 17: రెండో రోజు మంథని గోదావరినది తీరంలో వినాయక విగ్రహాల నిమజ్జనం మంగళవారం కొనసాగింది. సింగరేణి సంస్థ ఏర్పాటు చేసిన క్రేన్ సహాయంతో నమజ్జనం చేశారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు నదీతీరంలో విగ్రహాల నిమజ్జన సందడి కొనసాగింది.

గోదావరిఖనిలో లక్ష్మీనగర్ లడ్డుకు 1.5లక్షలు...

కోల్‌సిటీ, సెప్టెంబరు 17: గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని బోళ్ల బజార్‌లో గల గణపతి లడ్డుకు వేలం పాటలో రూ.1.5లక్షలు పలికింది. లక్ష్మీనగర్ మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాల లడ్డు వేలం పాటలో యైటింక్లయిన్‌కాలనీకి చెందిన కొప్పుల బలరాం లడ్డును దక్కించుకున్నారు. గోదావరిఖని గణపతి ఉత్సవాల చరిత్రలోనే ఇది రికార్డు.